క్లుప్తంగా

ఇంటి పన్నుపై వడ్డీ రాయితీ

నిడదవోలు: నిడదవోలు పురపాలక సంఘం పరిధిలో ఇంటి, ఖాళీ స్థలాల పన్నులపై ప్రభుత్వం వడ్డీ రాయితీ కల్పించిందని, దీనిని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి పన్ను బకాయిలు ఏకమొత్తంలో ఈ నెల 31లోగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. సెలవు రోజుల్లో కూడా పురపాలక సంఘంలో పన్నులు కట్టించుకుంటున్నామని చెప్పారు. వెంటనే పన్నులు చెల్లించి, వడ్డీ రాయితీ పొందాలని కమిషనర్ కోరారు.

9న చాగల్లులో బీసీ ఆత్మీయ సదస్సు

కొవ్వూరు: బీసీ ఆత్మీయ సదస్సును ఈ నెల 9న చాగల్లు కృష్ణదేవరాయ కల్యాణ మంటపంలో నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు తెలిపారు. సుమారు పదివేల మంది బీసీ సోదరులతో ఈ సదస్సు నిర్వహిస్తామన్నారు. బీసీ సంఘ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాస్ తదితరులు హాజరుకానున్నట్టు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌కు ప్రింటర్ అందజేత



ఎస్సై రమేష్‌కు ప్రింటర్‌ను అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్‌కు తృప్తి ఛారిటబుల్ ట్రస్ట్ రూ.18 వేలతో కొనుగోలు చేసిన కలర్ ప్రింటర్‌ను ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్‌కు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు వడ్లమూడి సుదర్శన్‌రాజు, ఏఎస్సై పరమహంస, సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరుపాడు విద్యార్థినికి రాష్ట్ర స్థాయి సైన్స్ అవార్డు



కాకినాడలో రాష్ట్ర స్థాయి బహుమతి అందుకుంటున్న విద్యార్థిని లీలా సంతోషి

గోపాలపురం: రాష్ట్ర స్థాయి సైన్స్ అవార్డుకు కొవ్వూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని లీలా సంతోషి ఎంపికైనట్టు హెచ్ఎం డి.శ్రీనివాసరావు సోమవారం ఇక్కడ తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల మూడున కాకినాడలో నిర్వహించిన శాస్త్రవేత్త మోనో యాక్షన్ (ఏకపాత్రాభినయం) విభాగంలో కొవ్వూరుపాడు అల్లూరి బాపినీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని కనుమూరి లీలా సంతోషి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించినట్టు హెచ్ఎం తెలిపారు. ఆమెకు తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయురాలు డి.శేషారత్నంను పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ



స్లమ్ ఏరియాలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ తేజశ్రీ

నిడదవోలు: పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా సోమవారం నెహ్రూనగర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో సోమవారం ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేశారు. పట్టణంలోని స్లమ్ ఏరియాల్లో, దూర ప్రాంతాలకు వెళ్లి, ఇతర కారణాల చేత పోలియో చుక్కలు వేయించని చిన్నారులకు.. నెహ్రూనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ఈ.తేజశ్రీ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేశారు. డాక్టర్ ప్రసన్నకుమార్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్ఐ సూర్యారావు మృతి

నల్లజర్ల: నల్లజర్ల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బొరోతు సూర్యనారాయణ(46) అనారోగ్యంతో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో మృతిచెందారు. గత కొంతకాలంగా లివర్ సంబంధ వ్యాధితో బాధపడుతున్నారు. గతేడాది తండ్రి బాపిరాజు చనిపోగా, నెల రోజుల క్రితం తల్లి కృష్ణవేణి కన్నుమూశారు, ఆ తర్వాత వారానికే సూర్యనారాయణ అస్వస్థతకు గురై, ఆస్పత్రి పాలయ్యారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నల్లజర్ల తహసీల్దార్ కృష్ణారావు, డిప్యూటీ తహసీల్దార్ కిశోర్‌కుమార్ ఆర్ఐ మృతికి సంతాపం తెలిపారు.

బిడ్డ నుంచి అవ్వ వరకూ సంక్షేమం

- పథకాలు అమలు చేసిన సీఎం జగన్
- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- అయ్యవరంలో పసుపుకుంకుమల పంపిణీ



అయ్యవరంలో మంత్రి వనితను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు, మహిళలు

నల్లజర్ల: అమ్మ కడుపులో ఉన్న బిడ్డ నుంచి.. ఆప్యాయంగా పలకరించే అవ్వ దాకా ప్రతిఒక్కరి అవసరాలు గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారని, ఇందుకు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ వేదికలయ్యాయని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. సోమవారం ఉదయం అయ్యవరంలో సర్పంచ్ గుడిశే వీరాస్వామి, ఎంపీటీసీ మారుబోయిన సత్యవతి ఆధ్వర్యంలో మంత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుంటే, ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు, జనసేనను కలుపుకొని పొత్తులతో పోటీకి వెళ్తున్నారని విమర్శించారు. అధికారం కోసం చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆరాటపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇలాంటి ఆలోచనలు మినహా ప్రజలకు మంచి చేయాలనే ఓ మేనిఫెస్టో కానీ, అజెండా కానీ లేవన్నారు. ప్రజల కష్టాలను దూరం చేయాలనే తలంపుతో, ఏ రాష్ట్రంలో లేనివిధంగా వలంటీర్, సచివాలయ వ్యవస్థలను తెచ్చి, వారి ద్వారా ప్రజల ప్రతి అవసరాన్ని తీరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అని గర్వంగా చెబుతున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేయాలని పిలుపునిచ్చారు. ఇంట్లో ఉన్న ఓట్లన్నీ వైఎస్సార్ సీపీకే వేయాలని కోరారు. అనంతరం కొత్తగూడెంలో పార్టీ నేతలు గంటా అప్పారావు, కనికెళ్ల కెనడీ, సాంబయ్య ఆధ్యక్షతన ఆత్మీయ సమావేశం జరిగింది. అనంతరం పుల్లలపాడు, ముసుళ్లగుంట గ్రామాలకు రావిచెట్టు సెంటర్‌లో సర్పంచ్ అల్లూరి సూర్యచంద్రరావు, ఎంపీటీసీ వేగి ప్రతాప్ అధ్యక్షతన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రకాశరావుపాలెంలో పార్టీ నేతలు కరుటూరి లక్ష్మీగణేశ్వరరావు, ముత్తిన నరేష్, నాని ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ ముప్పిడి లక్ష్మి, గగ్గర శ్రీనివాస్, కారుమంచి రమేష్, బంక అప్పారావు, వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం, ముప్పిడి వెంకటరత్నం, మట్టా లక్ష్మి, కటారి రాజ్‌కుమార్, మద్దిపాటి ప్రసాద్, సూరిబోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అయ్యవరంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు చుక్కా నరసింహరావు అధ్యక్షతన మంత్రి వనితను గజమాలతో సత్కరించారు.

జగనన్న ఇళ్ల స్థలాలపై సర్వ హక్కులు

నల్లజర్లలో 256 మందికి పట్టాలు అందజేసిన మంత్రి వనిత



నల్లజర్లలో ఇళ్ల పట్టాలు అందజేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

నల్లజర్ల: గత ప్రభుత్వాలు ఎన్నడూ చేయనివిధంగా పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలు, ఇళ్లపై పూర్తి హక్కు కల్పిస్తూ కన్వేనియన్స్ డీడ్, సేల్ డీడ్‌ను జగనన్న ప్రభుత్వం అందజేయడం చారిత్రాత్మకమని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. సోమవారం సాయంత్రం నల్లజర్ల అల్లాడరామయ్య కల్యాణ మంటపంలో 256 మందికి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు మంత్రి వనిత అందజేశారు. ఒక్క రూపాయి ఖర్చు, అధికారుల చుట్టూ తిరిగే అవసరం లేకుండానే జగనన్న ప్రభుత్వం 8.70 ఎకరాల భూమిని రూ.లక్షలతో కొనుగోలు చేసి, పేదలకు అందజేయడం ఆనందదాయకమని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, హక్కులు కల్పించడం వల్ల ఆస్తి విలువ పెరగడమే కాకుండా, ఆర్థిక భరోసా కల్పించడం జరిగిందన్నారు. ఇన్ని మేలు చేస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాల్సిన ఆవశ్యకతను ఆమె వివరించారు. జల్‌జీవన్ మిషన్‌లో ఏర్పాటు చేసిన 1.50 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకును మంత్రి ప్రారంభించారు. తొలుత అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి మోటార్ సైకిళ్లతో ర్యాలీగా బాణసంచా, తీన్‌మార్ డప్పులతో ఊరేగింపుగా సభాస్థలికి చేరారు. తహసీల్దార్ కృష్ణారావు, వీఆర్‌ఓ మూర్తి మంత్రిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముప్పిడి లక్ష్మి, సర్పంచ్ పల్లి జ్యోతి, ఉప సర్పంచ్ రాయుడు విజయకుమార్, వైస్ ఎంపీపీ ఆరుగొల్లుమణి, ఎంపీటీసీ మేణ్ని వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, మద్దిపాటి ప్రసాద్, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, అప్పసాని నారాయుడు, బంక అప్పారావు, పిచ్చుకుల ప్రసాద్, మేణ్ని యువరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు చేరువగా ఆధునిక వైద్యం

ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



వద్దూరులో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



వద్దూరులో ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు

ఉండ్రాజవరం: వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామాలకు ఆధునిక వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. వద్దూరు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ముందుగా గ్రామంలో రూ.26.80 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఈ విలేజ్ క్లినిక్‌లో 24 గంటల వైద్య సేవలు లభిస్తాయన్నారు. 12 రకాల వైద్య సేవలతో పాటు, వివిధ రకాల పరీక్షలు, మందులు అందజేస్తారని చెప్పారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, 108, 104 సర్వీసులతో పాటు, నాడు–నేడు కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు. అనంతరం గ్రామంలో రూ.18 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, రూ.6 లక్షల వ్యయంతో నిర్మించిన బీసీ శ్మశాన వాటిక ప్రహరీని ఎమ్మెల్యే ప్రారంభించారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు

వద్దూరు గ్రామానికి చెందిన 12 మంది టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు ఆ పార్టీలను విడనాడి సోమవారం ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన టీడీపీ గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడు కిలాడి ఆంజనేయులు, తూము ధనరాజు, గంటా హనుమంతరావు, దాసరి లక్ష్మణరావు, గోర్రెల శ్యామ్‌కుమార్, యు.వెంకటేష్, సీహెచ్ విజయ్‌కుమార్, ఎల్ నవీన్, సీహెచ్ ప్రసాద్, ఏ.శ్రీనుకు ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, మండల జేసీఎస్ కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు, సర్పంచ్ రఘుమండ తేజశ్రీ శ్రీనివాసు, ఎంపీటీసీ వేంద్ర అనంతలక్ష్మి, వేగిశ్న నాగరాజు, బయ్యే సత్తిపండు, రాపాక కొండయ్య, తానేంకి సత్యనారాయణ, రఘుమండ నాగరాజు, కట్టా శ్రీను, పెచ్చేటి పసలయ్య, ఆబోతు ముత్యాలరావు, ఆర్.సాయి, అల్లూరి సత్యనారాయణరాజు, కె.దత్తుడు, కె.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నేతల చేరిక

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు, నిడదవోలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధికి ఆకర్షితులై కలవచర్ల గ్రామానికి టీడీపీ నాయకులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీ జన్మభూమి కమిటీ సభ్యులు కొండేటి సుబ్బారావు, రవి కుమార్, ప్రసాద్, కొండేటి శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, పార్టీ గ్రామ అధ్యక్షుడు బోనేపల్లి సుబ్బారావు, పాతాల ప్రసాద్, జువ్వల చక్రధర్, పాతాల ఆనంద్, జువ్వల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- సూర్యారావుపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం



సూర్యారావుపాలెంలో మహిళలకు సంక్షేమ బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఈ ఐదేళ్లలో ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యమిచ్చామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. సూర్యారావుపాలెం గ్రామంలోని ఎస్సీ ఏరియాలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అవినీతి రహితంగా, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు అవసరమైన సేవలు వారి గడప వద్దకే అందుతున్నాయన్నారు. వైఎస్సార్ పింఛను కానుక, జగనన్న చేయూత, వైఎస్సార్ ఆసరా, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష, రైతు భరోసా, సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందన్నారు. జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేసి, అర్హులందరికీ ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జెడ్పీటీసీ నందిగం భాస్కరరామయ్య, ఎంపీటీసీ పెదపోలు వెంకటలక్ష్మి, గుల్లపల్లి ఉదయభాస్కరరావు, కోటిపల్లి గణపతి, దిద్దుపూడి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా ప్రజలందరికీ లబ్ధి

- ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు
- మార్కొండపాడులో గడప గడపకూ మన ప్రభుత్వం



మార్కొండపాడులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

చాగల్లు: రాష్ట్రంలో ప్రతిఒక్కరికీ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. మార్కొండపాడు గ్రామంలో సోమవారం రాత్రి వరకూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఇందిరానగర్ కాలనీలో ఇంటింటికీ తిరిగి వృద్ధులు, మహిళలు, యువత, చిన్నారులతో మాట్లాడారు. ఆయనకు అడుగడుగునా మహిళలు హారతులిచ్చి బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని, పరిష్కరించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సీఎం రూపొందించారని తెలిపారు. గత ప్రభుత్వానికి, ఇప్పుడు జగనన్న ప్రభుత్వానికి తేడా వివరిస్తూ, అర్హులైన ప్రతిఒక్కరికీ కులమతాలు, పార్టీలకతీతంగా పథకాలు అందిస్తున్న ప్రభుత్వం ఏపీలో మినహా దేశంలో ఎక్కడా లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, సొసైటీ అధ్యక్షుడు గంగిశెట్టి వాసు, సర్పంచులు ముప్పిడి మహాలక్ష్ముడు, కుదప రాంబాబు, మట్టా వెంకట్రావు, పిల్లి తిరుమలరావు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, బండి పట్టాభి రామారావు, ఏఎంసీ డైరెక్టర్ అయినం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా సీఎం జగన్ వెంటే..

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- చాగల్లులో మండల స్థాయి బూత్ కన్వీనర్లతో సమావేశం



తాళ్లపూడిలో జరిగిన బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న తలారి వెంకట్రావు

చాగల్లు: పేదవాళ్లకు, పెత్తందార్లకు జరుగుతున్న యుద్ధంలో ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. చాగల్లు కాపు కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, బూత్ కన్వీనర్ల మండల స్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న 40 రోజులు పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేసి, వైఎస్సార్ సీపీ జెండాను మళ్లీ ఎగురవేయాలన్నారు. 57 నెలల కాలంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశామని చెప్పారు. వైఎస్సార్ సీపీ పాలనలో ప్రభుత్వం తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులను ప్రతిఒక్కరూ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు చెప్పాలన్నారు. బూత్ కన్వీనర్లు మరింత క్రియాశీలకంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు, అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

మరిన్ని రోజులు కష్టపడి పనిచేయాలి

తాళ్లపూడి: వచ్చే 45 రోజులు బూత్ స్థాయిలో కమిటీ సభ్యులు కష్టపడి పనిచేయాలని కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. తాళ్లపూడిలోని సొలస దమయంతి ఆర్యవైశ్య కల్యాణ మంటపం వద్ద మండల స్థాయి బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వెంకట్రావు, ఐప్యాక్ టీంతో కలిసి బూత్ కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం చేసి, కిట్లు అందజేశారు. వచ్చే రోజులు చాలా కీలకమైనవని, మేము సిద్ధం మా బూత్ సిద్ధం అనే నినాదంతో ముందుకు వెళ్లాలన్నారు. ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ బూత్ కమిటీలో మొత్తం నలుగురు సభ్యులు ఉంటారన్నారు. వారు వలంటీర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించాలన్నారు. జనంలో వైఎస్సార్ సీపీకి బలం ఉందని, వారు ఓటు వేసేలా చూడాలన్నారు. అదేవిధంగా పోలింగ్ శాతం పెరిగేలా చూడాలన్నారు. మోసం చేసే చంద్రబాబు కావాలో, ఇచ్చిన హామీలను అమలు చేసిన జగన్ కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, గూడూరి రాధిక, సర్పంచ్‌లు కొమ్మిరెడ్డి పరశురామారావు, నామా శ్రీనివాస్, తిగిరిపల్లి వెంకటరావు, గండి రాంబాబు, నాయకులు తోట రామకృష్ణ, పిట్టా శ్రీనివాస్, పోశిన శ్రీకృష్ణదేవరాయులు, నక్కా చిట్టిబాబు, సిద్దంశెట్టి కృష్ణ, వల్లభశెట్టి శ్రీనివాస్, చిన్ని, మండిగ గిరి తదితరులు పాల్గొన్నారు.

సమర్థంగా, సమన్వయంతో పని చేయండి

కొవ్వూరు: బూత్ స్థాయి కమిటీలు రానున్న ఎన్నికల్లో సమర్థంగా పనిచేయాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బూత్ కమిటీల సమావేశం నిర్వహించారు. ప్రతి బూత్ పరిధిలో ఉన్న ఓటర్లపై ఆయా బూత్ కమిటీ చైర్మన్, సభ్యులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. బూత్ పరిధిలో ఉండే నాయకులను సమన్వయం చేసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, పార్టీ పట్టణ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, నాయకులు ముదునూరి నాగరాజు, శ్రీరామ సొసైటీ, దొమ్మేరు పీఏసీఎస్ అధ్యక్షులు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, ముదునూరి సూర్యనారాయణరాజు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు సిద్ధన వాసు, బత్తి నాగరాజు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్వారీ లారీ డ్రైవర్ల ఆందోళన

దేవరపల్లి: నూతన వేతన ఒప్పందాన్ని క్వారీ లారీ డ్రైవర్లు, హెల్పర్లకు తక్షణం అమలు చేయాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మస్తాన్ డిమాండ్ చేశారు. సోమవారం దుద్దుకూరులో లారీ డ్రైవర్లు, హెల్పర్లతో సమావేశం నిర్వహించి, ఆందోళన చేశారు. మూడేళ్లకు ఒకసారి జరుగుతున్న వేతన ఒప్పందం కాల పరిమితి ముగిసినందున, నూతన వేతన ఒప్పందం కోసం యాజమాన్యాలకు డిమాండ్ నోటీసులు అందజేసి పది రోజులు గడిచినా ఇంతవరకూ చర్చలు జరపలేదన్నారు. ఈ నెల 9వ తేదీలోగా కార్మిక సంఘాల నాయకులతో యాజమాన్య ప్రతినిధులు చర్చలు జరిపి, నూతన వేతన ఒప్పందం చేయకపోతే సమ్మెకు సిద్ధమవుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ ఏడుకొండలు, చిక్కాల నాగరాజు, పోశిబాబు, పోలుమాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు తప్పనిసరిగా చేయించాలి



భీమోలు ఆర్‌బీకే వద్ద రైతులకు ఈ–పంట నమోదు పత్రాలను అందజేస్తున్న సర్పంచ్

గోపాలపురం: ప్రతి ఒక్క రైతు ఈ–పంట నమోదు చేయించుకుని, ఒకసారి ముసాయిదాను పరిశీలించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.రాజారావు అన్నారు. ఏమైనా మార్పులుచేర్పులు ఉంటే చేయించుకోవాలని సూచించారు. భీమోలు రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రాజారావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా ఎటువంటి లబ్ధి పొందాలన్నా రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రైతులకు ఈ–పంట నమోదు పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బండారు జగన్‌మోహన్‌రావు, రైతులు పాల్గొన్నారు.

పట్టిసీమకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

నిడదవోలు : మహా శివరాత్రి సందర్భంగా నిడదవోలు ఆర్టీసీ బస్ డిపో నుంచి భక్తుల సౌకర్యార్థం ఈ నెల 7, 8 తేదీల్లో పట్టిసీమకు ప్రత్యేక బస్ సర్వీసులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ కె.శ్రీరామ్‌కుమార్ తెలిపారు. 30 మంది భక్తులు గ్రూపుగా ఏర్పడితే వారు కోరిన శైవ క్షేత్రాలకు బస్సులు నడుపుతామన్నారు.

వలంటీర్ కుటుంబానికి రూ.5 లక్షల సాయం

చెక్కు అందించిన హోం మంత్రి



వలంటీర్ కుటుంబానికి చెక్కును అందజేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

నల్లజర్ల: సుభద్రపాలెం గ్రామ సచివాలయ వలంటీర్ బిరుదుగడ్డ కృష్ణ(35) గుండెపోటుతో నెల క్రితం మరణించారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పుట్టెడు బాధలో ఉన్న ఆ కుటుంబానికి బాసటగా నిలుస్తూ, ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును సోమవారం సాయంత్రం నల్లజర్లలో హోం మంత్రి తానేటి వనిత వలంటీర్ భార్య పావనీకుమారికి అందజేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవడానికి, పిల్లల భవిష్యత్తుకు ఎప్పుడూ అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వ సాయాన్ని ఎన్నటికీ మరువలేమని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆస్పత్రులకు వెళ్లి పింఛను అందజేత



ఆస్పత్రిలో లక్ష్మికి పింఛను అందిస్తున్న వలంటీర్ సౌందర్య



వెంకటాచారికి పింఛను అందిస్తున్న వలంటీర్ సత్యతేజ

నల్లజర్ల: ఏలూరు ఆశ్రమం ఆస్పత్రిలో వృద్ధురాలు వీరవెల్లి లక్ష్మి చికిత్స పొందుతోంది. ఆమె డిశ్చార్జి కాకపోవడంతో వలంటీర్ పెనుమాక సౌందర్య సోమవారం ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేసింది.

రాజమహేంద్రవరానికి వెళ్లి..

నిడదవోలు : పట్టణంలోని 24వ వార్డులో ఉంటున్న వృద్ధుడు కడిమి వెంకటాచారి గుండె సంబంధ వ్యాధితో రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు..విషయం తెలుసుకున్న వలంటీర్ ఎస్.సత్యతేజ, సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి దేవరపు సత్యవాణి సోమవారం ఆస్పత్రికి వెళ్లి, ఆయనకు పింఛను అందజేశారు.

ప్రైవేటు స్కూళ్లలో పేదలకు ప్రవేశాలు

నల్లజర్ల: విద్యా హక్కు చట్టం ప్రకారం రాష్ట్రంలో అన్ని ప్రైవేటు స్కూళ్లలో ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల ఐదు నుంచి 25 వరకు అడ్మిషన్లు స్వీకరిస్తారని ఎంఈఓలు సత్యనారాయణ, భగవతీదేవి తెలిపారు. అనాథ, హెచ్‌ఐవీ బాధిత, దివ్యాంగుల పిల్లలకు 5 శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు 4, బలహీన వర్గాలైన బీసీ, మైనార్టీలకు 6 శాతం మొత్తం 25 శాతం సీట్లు కేటాయించినట్టు వివరించారు. గ్రామ సచివాలయం, నెట్ సెంటర్లలో అడ్మిషన్ల వివరాలు ఉంటాయన్నారు.

జూదరుల అరెస్టు, నగదు స్వాధీనం

కొవ్వూరు: దొమ్మేరు–ఆరికిరేవుల పుంత రోడ్డు మార్గంలో సోమవారం సాయంత్రం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. వీరి నుంచి రూ.14,920 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని మంగళవారం కోర్టులో హాజరు పర్చనున్నట్టు తెలిపారు.